నమస్తే తెలంగాణ
మెదక్
15 | హైదరాబాద్, ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | MEDAK

కొమురవెల్లి మల్లికార్జున స్వామి

నేడు 'మల్లన్న' పట్నం వారం

● భారీగా తరలిరానున్న భక్తులు ● అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు

చేర్యాల, ఫిబ్రవరి 10 : కొమురవెల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు పట్నం 4వ ఆదివారం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. పట్నం, లష్కర్‌వారాలతో పాటు 3 ఆదివారాలు హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. నేడు పట్నం వారానికి సుమారు 50వేల మందికి పైగా భక్తులు రానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం రూ. కోటీనలభై లక్షలు దాటింది. మరో ఎనిమిది వారాలు మిగిలిఉండడంతో హుండీతో పాటు ఆర్జిత సేవల ద్వారా మరింత ఆదాయం వచ్చే అవకాశమున్నది. స్వామి వారి క్షేత్రానికి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకోవడంతో పాటు పట్నం వేసి బోనం సమర్పించనున్నారు. మహామండపం, గంగరేగు చెట్టు ఆవరణతో పాటు తాము బస చేసిన గదుల వద్ద పట్నాలు వేయనున్నారు. మరికొందరు భక్తులు మల్లన్నగుట్టపై ఎల్లమ్మకు, అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్ల బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తుల కోసం ఆలయ ఈవో ఏ. బాలాజీ, కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

ఇబ్రహీంపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తున్న అధికారులు

ఇబ్రహీంపూర్ దేశానికే ఆదర్శం

అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన కేంద్ర బృందం

నారాయణరావుపేట, ఫిబ్రవరి 10 : ఇబ్రహీంపూర్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేంద్ర సెంట్రల్ ఢిల్లీ సెక్రటేరియెట్ లెవెల్ – డీ అధికారులు అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామాన్ని కేంద్ర సెంట్రల్ ఢిల్లీ సెక్రటేరియెట్ లెవెల్ డీ 8 మంది అధికారుల బృందం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను సందర్శించారు. ఈ సందర్భంగా డంప్ యార్డు, పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాల, పార్కు, గొర్రెలషెడ్డు, ఇంకుడు గుంతలు, వైకుంఠ ధామం, నర్సరీ వంటి అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో మురళీధర్‌శర్మ, ఎంపీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

అక్కన్నపేట: మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వొడితెల సతీశ్‌కుమార్

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి

- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- అసెంబ్లీ ఎన్నికల ఓటమిని సవాల్‌గా తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- అక్కన్నపేట మండలం బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం

అక్కన్నపేట, ఫిబ్రవరి 10 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని సవాల్‌గా తీసుకుని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో అక్కన్నపేట మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గెలిచిన నాడు ప్రజల్లోనే ఉన్నా.. ఓడినా కూడా ప్రజల మధ్యలోనే ఉంటున్న.. సంతోషం వచ్చినప్పుడు నవ్వడం, బాధ కలిగినప్పుడు ఏడవడం తన మనస్తత్వం కాదు' అని అన్నారు. తన ఓటమికి కారణాలు ఏమైనప్పటికీ, ప్రస్తుతం దాని గురించి ఆలోచించడం లేదని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పార్టీ, కార్యకర్తల కోసం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పని చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసం ఊపిరి ఉన్నంత వరకు సేవచేస్తా, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యకర్తలే నా బలం, బలగమని, ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలంతా క్రియాశీలకంగా పనిచేసి అభ్యర్థి గెలుపులో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జడ్పీటీసీ భూక్యా మంగ, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, సీనియర్ నాయకులు మాలోతు బీలూనాయక్, కందుల రాంరెడ్డి, జిల్లెల గాల్‌రెడ్డి, లింగాల సాయన్న, మ్యాక నారాయణ, కాసర్ల అశోక్‌బాబు, వెల్ది శోభారాణి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరుశరాములు, చిట్యాల సంపత్, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

పెండింగ్ ప్రాజెక్టులు, ఇతర సమస్యలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, ఫిబ్రవరి 10 : పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధానమంత్రి మోదీ కొమ్ముకాస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. శనివారం హుస్నాబాద్‌లోని అనేభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు తాకట్టుపెట్టి, ఆర్థికరంగాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక మతఘర్షణలు పెరిగిపోయాయన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రూ.50లక్షల కోట్ల అప్పులు చేస్తే మోదీ పాలనలో రూ.100 లక్షల అప్పులయ్యాయన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిత్యావసరాల ధరలను పెంచిన బీజేపీ, వచ్చే ఎన్నికల్లో ఓటమి పాలవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇతర సమస్యలపై సుధీర్ఘంగా చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని శాఖల ఉద్యోగులు ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని, దీనిపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మందపవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, వనేశ్, అశోక్, భాస్కర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడీ.. హామీల జాడేదీ..!



రాష్ట్ర బడ్జెట్‌పై ప్రజల నిట్టూర్పు
రైతులకు భరోసా ఇవ్వని బడ్జెట్
ఆరు గ్యారంటీలకు చట్టభద్రత కరువు
మెదక్ జిల్లాకు మొండిచేయి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ నాయకులు ఎన్నో హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కావాల్సిన నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. అధికారంలోకి రాగానే రైతులకు డిసెంబర్ 9న రెండు లక్షల రూపాయలు పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదు. పైగా ఈ బడ్జెట్‌లో రుణమాఫీపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని రైతు సంఘాల నాయకులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల నుంచి తమ పంట పంట రుణాలు మాఫీ అవుతాయని ఎదురుచూసిన రైతులకు నిరాశనే మిగిలింది. ఇప్పటి వరకు ఏ సమయంలోపు పంట రుణమాఫీ చేస్తారు. ఏ విధంగా రుణమాఫీ చేస్తారనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా బడ్జెట్‌లో పేర్కొనలేదు. ఇక రైతు భరోసా ఊసేలేదు. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కింద ప్రతి ఎకరాకు రూ. 5 వేల చొప్పున ఏటా రెండుసార్లు రైతుల ఖాతాల్లో జమచేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఏడాదికి ఇస్తానని ప్రకటించింది. ప్రస్తుత యాసంగి పంటలకు గత ప్రభుత్వం మాదిరిగానే రైతుబంధు వేసింది. గడిచిన రెండు నెలల నుం ఇంత వరకు రైతులకు పూర్తి స్థాయిలో రైతుబంధు పడలేదు. కేవలం రెండు ఎకరాలలోపు రైతులకు వేసి నిలిపివేశారు. దీంతో రైతులకు రైతుబంధు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వరి పంటకు బోనస్ ఇస్తా అని చెప్పి బడ్జెట్‌లో దాని ఊసెత్తలేదు. మక్కలు, కంది, సోయా తదితర పంటలకు మద్దతు ధర గురించి ప్రస్తావించలేదు. చేయూత పథకం గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. రాష్ట్ర బడ్జెట్ ఏఒక్క వర్గాన్ని తృప్తి పరిచేలా లేదు.

ప్రజలు ఎంతోఆశగా ఎదురుచూసిన రాష్ట్ర బడ్జెట్ నిరాశనే మిగిల్చింది. రైతులకు రెండు లక్షల రూపాయల పంట రుణమాఫీ, వరికి బోనస్, రైతుభరోసా, చేయూత తదితర పథకాలకు కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు సరిపడా నిధుల కేటాయింపులు లేకపోవడంతో హామీలు అటకెక్కినట్లేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన వ్యవసాయరంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వలేదని అన్నదాతల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతున్నది. శనివారం రాష్ట్ర శాసనసభలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై అన్నివర్గాలు అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఈ బడ్జెట్ అంకెల గారడీ తప్పా ఏఒక్క వర్గానికి ప్రయోజనం చేకూరేలా లేదని మేధావులు, రైతు సంఘాల నాయకులు, ఆర్థికవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

- సిద్దిపేట, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఆరుగ్యారంటీలు పూర్తిగా అమలయ్యేనా...

ఆరుగ్యారంటీల పథకాలకు శాసనసభలో చట్టం చేస్తామని ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పి ఇప్పుడు మాట తప్పారని ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆరు గార్యంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపిందని, బడ్జెట్‌లో వాటికి కేటాయించిన నిధులు ఏ మూలకు సరిపోవని ప్రతిపక్షాలతో పాటు ఆర్థికవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ యువతకు భృతి, ఉద్యోగాల నోటిఫికేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బడ్జెట్ చూస్తే తేటతెల్లమవుతున్నదని నిరుద్యోగులు, విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, మూడు డీఏల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. బడ్జెట్‌లో ఆ మాట చెప్పనే లేదు. మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటోరిక్షా కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేయక పోవడంపై ఆటోవాలాలు ఆగ్రహంతో ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వడంతో పాటు ప్రతి ఎకరాకూ సాగునీరిచ్చి రైతుల పంటలను కాపాడింది. ఈ ప్రభుత్వం ఇప్పుడే అనధికార కరెంట్ కోతలు విధిస్తున్నది.దీంతోపాటు తరుచుగా కరెంట్ ట్రిప్ అవుతున్నది. యాసంగి పంటలు వేసి రెండు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదుల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ పాలనలో మాటలు గొప్ప.. పనులు సున్నా అన్నట్లుగా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యారంగానికి తీవ్ర అన్యాయం

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగింది. కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో ప్రతి మండలంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్‌చార్జీలపై స్పష్టత లేదు. రాష్ట్రంలో 800 గురుకులాలు, కళాశాలలకు పక్కాభవనాలు లేవు. వాటి నిర్మాణానికి ఈ నిధులు ఏ మాత్రం సరిపోవు. వెంటనే విద్యారంగానికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించాలి.

– కిందిదొడ్డి సతీశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు,కంగ్టి

విద్యారంగానికి నామమాత్రపు నిధులు

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ విద్యారంగానికి ఏమాత్రం మేలుచేసేలా లేదు. కోఠారి కమిషన్ ప్రకారం విద్యాశాఖకు బడ్జెట్‌లో 12శాతం నిధులు కేటాయించాలి. దీనిని ప్రభుత్వం పాటించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మనఊరు–మనబడి' పథకాన్ని ఈ సర్కారు నీరుగారుస్తున్నది. దానికి సంబంధించిన బడ్జెట్‌లో పేర్కొనక పోవడం విడ్డూరంగా ఉంది. ప్రతి మండలంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తరహా విద్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పడం మంచి పరిణామం. వచ్చే విద్యా సంవత్సరానికి 20 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించక పోవడం నిరుద్యోగులకు నిరాశనే మిగిల్చింది.

– మల్లారెడ్డి, పీఆర్టీయూ మెదక్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

ప్రభుత్వ తీరును నిరసిస్తూ సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు,వృద్ధులు, బీడీకార్మికులు

మూడు నెలలుగా పింఛన్ లేదు..

- సిద్దిపేటపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష
- తీరుమారకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం
- జిల్లా దివ్యాంగుల సంఘం నాయకుడు కెమ్మసారం అశోక్
- దివ్యాంగులు, బీడీ కార్మికులు, వృద్ధుల నిరసన

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పింఛన్‌దారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని దివ్యాంగులు, వృద్ధులు, బీడీ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడునెలలు గడుస్తున్నా పింఛన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ శనివారం సిద్దిపేట లోని డబుల్ బెడ్ రూమ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం నేత కెమ్మసారం అశోక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో లెక్కకు మించి హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో ఒక నెల పింఛన్ పెండింగ్‌లో ఉన్నా.. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన డబ్బులు ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లాపై ప్రభుత్వం కక్షకట్టిందని, కొన్ని జిల్లాల్లో పింఛన్లు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, కానీ సిద్దిపేటకు ఇవ్వక పోవడం ఏంటని మండిపడ్డారు. చాలామంది వృద్ధులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు పింఛన్‌పైనే ఆధారపడి బతుకుతారని, డబ్బులు వస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి ఉందని అన్నారు. పింఛన్లు పెంచి మార్పు తెస్తామని చెప్పి, ఇప్పటివరకు ఇచ్చే పింఛన్ కూడా సరిగా ఇస్తలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధానాన్ని అవలంబిస్తే సిద్దిపేట జిల్లా పింఛన్‌దారులంతా ఏకమై రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పీఆర్‌సీ, డీఏ అంశాలు ప్రస్తావించక పోవడం బాధాకరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పీఆర్‌సీ, డీఏ తదితర ఉద్యోగుల ప్రయోజనాలను ప్రస్తావించక పోవడం బాధాకరం. బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఏయే విభాగాలకు ఎంత అనేది స్పష్టం చేయక పోవడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నది. బడ్జెట్‌పై చర్చ సందర్భంగానైనా పీఆర్‌సీ అమలు, డీఏ, ఫిట్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సక్రమంగా ఇతర శాఖలకు కేటాయించకుండా ఖర్చు చేయాలి. పబ్లిక్‌స్కూళ్ల ఏర్పాటు, గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం సత్వరంగా చేపట్టాలి. బడ్జెట్‌లో ఉద్యోగులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– గంగిశెట్టి మహేందర్, టీఆర్‌టీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు

కాంగ్రెస్ సర్కారుపై అన్నివర్గాల పెదవి విరుపు

ఉమ్మడి మెదక్ జిల్లా ఊసేలేదు...

బడ్జెట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాకు ఏమైనా నిధులు వస్తాయేమో అని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ ఉన్నప్పటికీ పైసా నిధులు కేటాయించ లేక పోయారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఓట్లు పడేదాక ఒకోలా.. ఓట్లు పడ్డాక మరోలా' కాంగ్రెస్ తీరు ఉందని అన్నివర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. అలవి కానీ హామీ లిచ్చి ఇప్పుడు అమలు చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను దగా చేసేలా బడ్జెట్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రైతుల నడ్డివిరిచేలా ఉంది. ఎన్నికల ముందు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీలు గుప్పించిన కాంగ్రెస్ ఆ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. వ్యవసాయానికి ఆశించిన స్థాయిలో నిధులు ప్రకటించలేదు. రైతుభరోసా, రైతుబీమా, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీఇచ్చి అందుకనుగుణంగా నిధులివ్వలేదు. రైతుబంధు నిధులను ఇంకా ఖాతాల్లో జమచేయలేదు. వరి ధాన్యాన్ని అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పి ఎలాంటి నిర్ణయాన్ని వెలువరించలేదు. కాంగ్రెస్ తీరుపై రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వ్యవసాయానికి మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి.

– శివకుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్

కాంగ్రెస్‌వి అబద్ధపు వాగ్దానాలు

బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ పాలన అంకెల గారడీ, మాటల గారడీలాగా ఉంది. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా కాంగ్రెస్ తప్పించుకుంటున్నది. వ్యవసాయానికి రూ.19,746 కోట్లు కేటాయించారని.. రైతుభరోసా, రుణమాఫీ, పంట బీమా, రైతు బీమా, వడ్డీ లేని పంట రుణాలు, విత్తనాభివృద్ధి పరిస్థితి ఏమిటి?. రైతుల కోసం వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్ చిత్తు కాగితమేనని బడ్జెట్ సూచిస్తున్నది. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చెత్తబుట్టలో వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల బలోపేతం గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది. 15 శాతం ఉన్న మైనార్టీలకు రూ.2,200 కోట్లు కేటాయించి.. 50 శాతానికి పైగా ఉన్న బీసీ సంక్షేమానికి రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించి బీసీ వ్యతిరేక ప్రభుత్వంగా మారింది. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేసినవన్నీ అబద్ధపు వాగ్దానాలే అనే భావన ప్రజల్లో వ్యక్తమవుతున్నది.

సిద్దిపేటకు రెండు గోల్డ్ మెడల్స్

డబుల్ గోల్డ్ మెడల్ సాధించిన గాడిచర్ల జితేశ్

సిద్దిపేట, ఫిబ్రవరి: భద్రాద్రి కొత్తగూడెంలో జరుగుతున్న 9వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా స్టాండింగ్ బ్రాడ్‌జంప్‌లో సిద్దిపేటకు చెందిన గాడిచర్ల జితేశ్ 1.94 మీటర్ల విభాగం, 300 మీటర్ల పరుగుపందెం పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి రెండు గోల్డ్‌మెడల్స్ సాధించాడు. తెలంగాణ స్టేట్ అథ్లెటిక్స్ సెక్రెటరీ సారంగపాణి గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ జితేష్‌కు అందజేశారు. గోల్డ్‌మెడల్ సాధించిన సందర్భంగా సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గ్యాదరి పరమేశ్వర్ సెక్రెటరీ వెంకటస్వామి, కోచ్ కల్లపల్లి కృష్ణలు జితేష్‌ను అభినందించారు.

అనారోగ్యంతో తండ్రీకొడుకు మృతి

అనారోగ్యంతో మృతిచెందిన అమలాల్ మొహజీ, అన్నుమొహజీ (ఫైల్)

హత్నూర, ఫిబ్రవరి 10 : అనారోగ్యంతో తండ్రీకొడుకు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొత్తగూడెం శివారులోని మాన్‌సింగ్ ఇటుకబట్టీ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. హత్నూర ఎస్సై సుభాష్ వివరాల ప్రకారం..ఒడిశా రాష్ట్రానికి చెందిన అమలాల్ మొహజీ(35) తన భార్య నర్మద మొహజీ, ఇద్దరు కొడుకులు జైమొహజీ, అన్ను మొహజీతో కలిసి కొత్తగూడెం శివారులోని ఇటుక బట్టీలో రెండునెలలుగా కార్మికులుగా పనిచేస్తున్నారు. కొద్దిరోజులుగా అమలాల్ మొహజీ, చిన్నకొడుకు రెండున్నర ఏండ్ల అన్నుమొహజీ విరేచనాలతో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి విరేచనాలు ఎక్కువ కావడంతో చికిత్స నిమిత్తం ఇటుబట్టీల యజమాని మాన్‌సింగ్ తన కారులో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య నర్మద మొహజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

కనీస సౌకర్యాలు కరువు...

ఇటుక బట్టీల వద్ద ఇటుకబట్టీల యజమానులు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కుటుంబాలతో జీవనోపాధి కోసం వచ్చిన కార్మికులతో పనిచేయించుకుంటున్న యజమానులు కనీస సౌకర్యాలు కల్పించలేకపోతుండడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటుకబట్టీల వద్ద వెలువడే దుమ్ముధూళితో అనారోగ్యానికి గురవుతున్నారు. కార్మికులకు సమయానికి చికిత్స అందించక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రాణాల మీదికి వస్తున్నది. పెద్దలతో పాటు చిన్నారులు వారి తల్లిదండ్రుల వెంట పనులు చేస్తుండటంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు, వారి సంక్షేమానికి కృషిచేయాల్సిన సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.